www.prajasakti.com

ప్రజాశక్తి

గురువారం 15 ఫిబ్రవరి 2024

5

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు



ప్రభుత్వ పాఠశాల వార్షికోత్సవం

ప్రజాశక్తి -ఉలవపాడు

మండలంలోని పెద్దపట్టపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వార్షికోత్సవం ఘనంగా జరుపుకున్నారు. బుధవారం జరిగిన ఈ కార్యక్రమం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సలీం బాషా అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా ఎంఎల్ఎ మానుగుంట హాజరై మాట్లా డారు. సర్పంచ్ జయరాం, గ్రామ కాపులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంఎల్ఎ మానుగుంట మహీధర్‌రెడ్డి

కావలిలో 'కావ్య'కు కాక..!

'పసుపులేటి' ఒంటరిపోరుకు సిద్ధం - మాలేపాటి, కావ్య మధ్య బాబు సయోధ్య

కావలి టిడిపి ఇన్‌ఛార్జ్‌గా కావ్య కృష్ణారెడ్డిని ప్రకటించినప్పటి నుంచి కావలి టిడిపిలో కాక పుడుతుంది. నిన్నటి వరకు ఎడముఖం పెడముఖంగా ఉన్న మాలేపాటి సుబ్బానాయుడు, కావ్య కృష్ణారెడ్డి మధ్య సయోధ్య కుదిరింది. టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర ఇద్దరు నేతలను చంద్రబాబునాయుడు వద్దకు తీసుకెళ్లారు. సమస్య సర్దుమణిగిదంటుండగా పసుపులేటి సుధాకర్ మరో బాంబు పేల్చారు. తనకు టిడిపి టికెట్ ఇస్తానని చెప్పి మోసం చేసిందని, అందుకే తాను కావలి ఇండిపెండింట్‌గా పోరుకు సిద్ధమవుతున్నట్లు ప్రకటించారు. కావలిలో బహిరంగ సభ నిర్వహించారు. మారుతోన్న రాజకీయ పరిణామాలతో కావ్య కృష్ణారెడ్డికి టికెట్ ఉంటుందా లేదా అన ఎమానమే అంటున్నారు. వైసిపి నుంచి భారీగా నేతలు వలసరావడం, సమీ కరణలు ఏలా ఉంటాయో చూడాల్సి ఉంది..

చంద్రబాబునాయుడును కలిసిన కావ్య కృష్ణారెడ్డి, మాలేపాటి సుబ్బానాయుడు

ప్రజాశక్తి -నెల్లూరు ప్రతినిధి :కావలి నియోజకర్గ టిడిపిలో ఇంటిపోరు ముందుకు, వెనక్కి కదులుతోంది. ఎన్నికలు సమీపిస్తుండగా చకచక రాజకీయ పరిణామాలు మారిపోతున్నాయి. టిడిపి ప్రతిపక్షంగా ఉన్న నాడు కావలి ప్రాంతంలో నాయకులు కనిపించలేదు. ఇప్పుడు ఎన్నికలు రావడంతో తామంటే తామంటూ పోటీపడుతున్నారు. ఒకప్పుడు కావలికి అభ్యర్థే దొరకరనే స్థాయి నుంచి టికెట్ కోసం గొడవపడే స్థాయికి వచ్చాయి. టిడిపి ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర సూచనలు, సలహాలతో నాలుగేళ్లు నుంచి కావలి పార్టీ బాధ్యతలను మాలేపాటి సుబ్బానాయుడు చూస్తున్నారు. మారిన రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో మాజీ ఎంపిపి కావ్య కృష్ణారెడ్డిని పార్టీ ఇన్‌ఛార్జ్‌గా ఎంపిక చేసింది. దాదాపు అభ్యర్థి. ఏడాది నుంచి ఆయన పార్టీ నేతలతో టచ్‌లో ఉన్నారు. చంద్రబాబునాయుడును పలుమార్లు కలిశారు. పార్టీకి ఆర్థికంగా సహాయపడుతానని, తాను విజయం సాధించుకోడానికి భారీగా ఖర్చుపెట్టుకుంటానని అధినేత దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిసింది. ఈపరిణామాలతో టికెట్ ఆశిస్తూ వచ్చిన మాలేపాటి సుబ్బానాయుడు అసంతృప్తిగా ఉన్నారు. రోజుకో పార్టీ మారుతూ రాజకీయ అవగాహన లేని పసుపులేటి సుధాకర్ ఏదొకపార్టీ నుంచి పోటీచేసి, ఎంఎల్ఎ కావాలనే కోరిక. జనసేన, బిజెపి, టిడిపిల్లో చేరారు. తమకు టికెట్ ఇవ్వాలని గతంలో చంద్రబాబునాయుడును కలిశారు. చూద్దామని చెప్పడంతో కావలి నియోజకవర్గంలో సొంత నిధులతో పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. తానే అభ్యర్థినంటూ ప్రచారం చేసుకున్నారు. తన సామాజిక వర్గానికే టికెట్ వస్తుందని ఆశించారు. మారిన పరిస్థితుల్లో కావ్యకు అవకాశం ఇచ్చారు. మాలేపాటి, పసుపులేటి ఇద్దరు నిన్నటి వరకు కావ్యకు వ్యతిరేకంగా పావులు కదిపారు. బీద రవిచంద్రకు అత్యంత సన్నిహితుడు మాలేపాటిని ఆయన బుజ్జగించారు. కావ్యతో కలిసి పనిచేయాలని, పార్టీ చూసుకుంటుందని చెప్పడంతో ఆయన చల్లబడినట్లు తెలిసింది. బుధవారం విజయవాడలో రవిచంద్రతో వెళ్లి కావ్య కృష్ణారెడ్డి, మాలేపాటి సుబ్బానాయుడు చంద్రబాబు నాయుడును కలిశారు. ఇదే సమయంలో ఆయన సోదరుడు మాలేపాటి రవీంద్రనాయుడు వెళ్లారు. సమస్య సర్దుబాటు అయిందని భావించే క్రమంలో జిల్లాలో రాజకీయ పరిణామాలు వేగంగా మారుతున్నాయి. వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి టిడిపిలోకి వచ్చిన తరువాత కావలిలో అభ్యర్థి మార్పు ఉంటుందని ప్రచారం సాగుతోంది. మరో వైపు పసుపులేటి సుధాకర్ ఒంటరిపోరుకు సిద్ధమవుతున్నారు.

'పసుపులేటి' ఒంటరి పోరు..!

టిడిపి టికెట్ ఆశించి భంగపడ్డ పసుపులేటి సుధాకర్ ఇండిపెండెంట్‌గా పోటీచేయడానికి సిద్ధమవుతున్నారు. బుధవారం కావలి పట్టణంలో కావలి కదలింది పేరుతో బహిరంగ సభ నిర్వహించారు. వేలాదిగా సభకు తరలొస్తారని, తమ సత్తా ఏమిటో టిడిపి నేతలకు చూపించాలని చెప్పిన పసుపులేటికి చుక్కెదురైంది. ఆశించిన స్థాయిలో జనం రాకపోయినా తూతూ మంత్రంగా సభ నిర్వహించారు. కొందరు మహిళలను సభకు తరలించారు. ఈ సభలో తాను కావలి నుంచి ఇండిపెండెంట్‌గా పోటీచేస్తానని ప్రకటించారు. సుధాకర్ ప్రభావం ఎంతైనా టిడిపికి కొంత నష్టం చేకూర్చేలా కనిపిస్తోంది. బిసి కార్డుతో రంగంలోకి రావాలని చూస్తున్న ఆయనకు టిడిపి బిసి అభ్యర్థిని రంగంలోకి దింపే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. ఇదే జరిగితే కావ్య కృష్ణారెడ్డి పరిస్థితి ఏమిటో చూడాలి.

కావలి బహిరంగ సభలో తాను ఇండిపెండెంట్‌గా పోటీచేస్తానని ప్రకటిస్తున్న పసుపులేటి సుధాకర్

'ఆదాల'కు వైసిపి బుజ్జగింపు..!

◆సిఎంతో ప్రత్యేక భేటి

◆కాంట్రాక్ట్ బిల్లుల చెల్లింపు?

◆ఎంపి, ఎంఎల్ఎగానైనా పోటీ -ఆదాల

వైసిపిని కొద్దిరోజులుగా రాజకీయ దుమారం కుదిపేస్తుంది. ఇప్పటికే ముగ్గురు ఎంఎల్ఎలు పార్టీని వీడిన విషయం తెలిసిందే. ఇప్పుడు ముగ్గురు ఎంపిలు అదేదారిలోఉన్నారనే ప్రచారం సాగింది. ముగ్గురు ఎంఎల్ఎలు, ముగ్గురు ఎంపిలు నెల్లూరు వారే కావడం తెలిసిందే. వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఆదాల ప్రభాకర్‌రెడ్డి, మాగుంట శ్రీనివాసులురెడ్డిలు గత మూడు రోజుల నుంచి హైదరాబాద్‌లో మకాంపెట్టి రాజకీయాలు నడిపారు. మంగళవారం రాత్రి నెల్లూరు వచ్చిన ఆదాల ప్రభాకర్‌రెడ్డి బుధవారం తాడేపల్లిలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని కలిశారు. వైసిపి ఆయనను బుజ్జగించినట్లు తెలిసింది. ఇదే సమయంలో తనకు ప్రభుత్వం నుంచి రావాల్సిన కాంట్రాక్ట్ బిల్లులో సుమారు రూ.40 కోట్లు ప్రభుత్వం విడుదల చేసినట్లు తెలిసింది. తాను ఎంపి, ఎంఎల్ఎగా వైసిపి నుంచి పోటీచేస్తానని ఆదాల ప్రకటించారు. ఇది ఎంతమేరకు నిజమో చూడాలి.

ప్రజాశక్తి -నెల్లూరు ప్రతినిధి

నెల్లూరు ఎంపి ఆదాల ప్రభాకర్‌రెడ్డిని వైసిపి అధిష్టానం బుజ్జగించినట్లు తెలిసింది. గత కొద్ది రోజులుగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డితో కలిసి ఆదాల ప్రభాకర్‌రెడ్డి పార్టీ మారుతారని ప్రచారం సాగింది. ఇది నిజమన్నట్లు మూడ్రోజుల నుంచి వేమిరెడ్డి, ఆదాల, మాగుంట ముగ్గురు నేతలు రాజకీయ వ్యూహాలు రచించినట్లు తెలిసింది. వేమిరెడ్డి, మాగుంటను పార్టీలో చేర్చుకోడానికి చంద్రబాబు సుముఖత వ్యక్తం చేసినట్లు విశ్వసనీయ సమాచారం. ఆదాల విషయం మళ్లీ చూద్దామన్నట్లు ప్రచారం జరిగింది. వైసిపి పెద్దలు ఆదాలతో హైదరాబాద్‌లో కలిసి పలువిషయాలు చర్చించినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో మంగళవారం రాత్రి నెల్లూరు వచ్చిన ఆదాల ప్రభాకర్‌రెడ్డి బుధవారం కీలక ప్రకటన చేశారు. తాను వైసిపిలోనే ఉంటానని, పార్టీ మారే ఉద్దేశం లేదని, వేమిరెడ్డి, మాగుంటను కలిసిన విషయం వాస్తవమేనని చెప్పారు. తాను నెల్లూరు రూరల్, లేదా ఎంపి ఏ స్థానంలోనైనా పోటీచేస్తానని, పార్టీ మారనని మీడియాకు చెప్పారు. మధ్యాహ్నం తాడేపల్లిలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డితో ప్రత్యేకంగా భేటి అయ్యారు. పోటీ విషయంలో మాట్లాడినట్లు తెలిసింది. ఆదాల ప్రభాకర్‌రెడ్డి రాష్ట్ర వ్యాపితంగా కాంట్రాక్టు పనులు చేస్తుండగా, ప్రభుత్వం నుంచి పెద్ద మొత్తం బిల్లులు రావాల్సి ఉన్నట్లు తెలిసింది. ప్రభుత్వం ఆఫు మేఫూలపై రూ.40 కోట్ల వరకు బిల్లులు చెల్లించినట్లు సమాచారం. ఆదాల పోటీలో పాల్గొంటానని చెప్పడంతో ఆయన అనుచరులు ఆనందం వక్తం చేస్తున్నారు.ఆయనను నమ్ముకొని ఎందరో ఉన్నారని, ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని కోరుకుంటు వచ్చారు. ఇప్పుడు వైసిపిలోనే ఉంటానని చెప్పినా అనుమానాలు వెంటాడుతున్నాయి. 2019 ఎన్నికల సమయంలో టిడిపిలో ఉండి ప్రభుత్వం నుంచి రావాల్సిన బిల్లులు తీసుకొని ,కనుపర్తి పాడులో టిడిపి అభ్యర్థిగా ఎన్నికల ప్రచారం నిర్వహిస్తూ, సాయంత్రం లోటస్ పాంట్‌లో వైసిపిలో చేరి, నెల్లూరు ఎంపి అభ్యర్థిగా పేరు ప్రకటిం చుకున్నారు. ఆదాల రాజకీయ ఎత్తుగడలు పక్కనున్న వారికి కూడా చివరి వరకు తెలియవని చెబు తున్నారు. బి-ఫామ్ తీసుకునే వరకు ఆదాల రాజకీయ పయనం ఎటో తెలియడం లేదు. రాజకీయాల్లో ఎప్పుడు ఏదైనా జరగొచ్చు. ఏం జరుగుతుందో వేచి చూడాలి.

ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన ఆదాల ప్రభాకర్‌రెడ్డి

నిరసన వ్యక్తం చేస్తున్న మున్సిపల్ కార్మికులు

మున్సిపల్ కార్మికుల ధర్నా

జిఒలు విడుదల చేయాలని డిమాండ్

ప్రజాశక్తి-నెల్లూరు :మున్సిపల్ కార్మికులు తమ న్యాయమైన సమస్యలకు ప్రభుత్వం పరిష్కారం చూపాలని కోరుతూ ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) నేతలు డిమాండ్ చేశారు. గతంలో మున్సిపల్ కార్మికులకు సమ్మె కాలం సందర్భంగా ఇచ్చిన ఒప్పందాలకు జిఒలు విడుదల చేయాలని కోరుతూ కార్మికులు బుధవారం మున్సి పల్ కార్పొరేషన్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా కార్యదర్శి కె పెంచల నరసయ్య మాట్లాడుతూ డిసెంబర్ 26 నుంచి జనవరి 10 వరకు జరిగిన సమ్మె సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ కార్మికులను చర్చిలకు పిలిచి పారిశుద్ధ్య కార్మికులకు 21,000 జీతం, డ్రైవర్స్, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, మలేరియా కార్మికులకు 24,500, ఇంజినీరింగ్ కార్మికులకు స్కిల్, అన్ స్కిల్డ్ వేతనాలు చెల్లిస్తామని, సంక్షేమ పథకాల అమలు, రిటైర్మెంట్ బెనిఫిట్స్ తదితర డిమాండ్లను ఆమోదిస్తూ మినిట్స్ కాపీ ఇచ్చారన్నారు. సమ్మె విరమించి 37 రోజులు కావస్తున్నా వాటిని జిఒలు రూపంలో ఇవ్వ కుండా తాత్సారం చేయడం సరికాదన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర పభుత్వం స్పందించి సమ్మె విరమణ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాలను వెంటనే జిఒల రూపంలో ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ నగర రూరల్ కార్యదర్శులు అశోక్, దేశ మూర్తి, సునీల్, లోకేష్, ఎం శ్రీను, మహేష్, మల్లేశ్వరి, మరియన్న ఉన్నారు.

నిరసన వ్యక్తం చేస్తున్న ఉద్యోగ సంఘాల నాయకులు

ఉపాధ్యాయుల నిరసన

ప్రజాశక్తి-నెల్లూరు : ఉద్యోగ, ఉపాధ్యాయుల తమ న్యాయమైన సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బుధవారం ఉద్యోగ ఉపాధ్యాయ కార్మిక పెన్షనర్ల ఐక్య కార్యాచరణసమితి (ఎపిజెఎసి) రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నగర శాఖ ఆధ్వర్యంలో వినూత్న రీతిలో నిరసన చేపట్టారు. నగర శాఖ జెఎసి ఛైర్మన్ కన్వీనర్ చిలకా రామకృష్ణారెడ్డి, డేగల మార్కండేయులు ఆధ్వర్యంలో నగరంలోని అన్ని ప్రభుత్వ కార్యాల యాలు, అన్ని పాఠశాలల్లో ఉద్యోగ ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరై నిరసన తెలిపారు. భోజన విరామ సమయములో రూరల్ తహసీల్దార్‌ని కలిసి వినతిపత్రం అందజేశారు. జిల్లా జెఎసి ఛైర్మన్ మన్నేపల్లి పెంచల రావు, జిల్లా జెఎసి కన్వీనర్ నాయుడు వెంకటస్వామి, ఎపిఎన్‌జిఒస్ అసోసియేషన్ జిల్లా కోశాధికారి బందరుపల్లి వెంకటేశ్వర్లు, అసోసియేట్ అధ్యక్షులు ఆంజనేయ వర్మ,ఆర్గనైజింగ్ కార్యదర్శి గాదిరాజు రామకష్ణ, ఉపాధ్యక్షులు ఈ కరుణమ్మ, కష్ణ కుమార్ ఉన్నారు.

పొదలకూరు : రాష్ట్ర జెఎసి పిలుపు మేరకు పొదలకూరు తాలూకాలో బుధవారం స్థానిక తహసీల్దారు పొదలకూరు తాలూకా ఎన్‌జిఒ సంఘం ప్రెసిడెంట్ కె శ్రీనివాసులు కార్యదర్శి చిరంజీవి ఆధ్వర్యంలో ప్రభుత్వ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వ నుంచి ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిలను వెంటనే చెల్లించాలని కోరారు. తాలూకా ఛైర్మన్ శ్రీనివాసులు, కార్యదర్శి చిరంజీవులు, కోశాధికారి కామాక్షమ్మ, ఉపాధ్యక్షులు షాన్వాజ్, శ్రీహరి, సంయుక్త కార్యదర్శి నాగేశ్వరరావు, మహిళా సంయుక్త కార్యదర్శి రాధా కుమారి ఉన్నారు.

టిడ్కో ఇళ్ల పంపిణీలో గందరగోళం..!

పట్టాలు చించేసిన లబ్ధిదారుడు - భారీగా తరలివచ్చిన జనం.. నిరాశతో వెనక్కి..

ప్రజాశక్తి నెల్లూరు ప్రతినిధి

రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ష్టాత్మకంగా నిర్మించిన టిట్కో ఇళ్ల పంపిణీలో లబ్ధిదారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం నెల్లూరు నగరంలోని పరిధిలోని ఆరుచోట్ల రూ 900 కోట్లతో 15,552 ఇళ్ల నిర్మాణం చేశారు. అందులో బాగంగా అల్లీపురంలో మంత్రి ఆదిమూలం సురేష్, కాకాణి గోవర్ధన్‌రెడ్డి, చేతుల మీదుగా లబ్ధిదారులకు పంపిణి చేశారు. టిడిపి ప్రభుత్వం హయంలోనే టిట్కో ఇళ్లు దాదాపు 80 శాతం పూర్తి చేశారు. అప్పట్లోనే కొందరికి ఇంటి తాళాలు ఇచ్చారు. నాలుగన్నరేళ్ల నుంచి ఇళ్లు పింపిణి చేయాలని లబ్ధిదారులు కోరుతున్నారు. వివిధ రాజకీయపార్టీలు డిమాండ్ చేశాయి. ఎన్నికల సమీపిస్తుండడంతో రాష్ట్ర ప్రభుత్వం పనులు పూర్తి చేయకుండానే తూతూ మంత్రంగా కార్యక్రమం నిర్వహించారు. నగరంలోని ఆరు ప్రాంతాలకు చెందిన లబ్ధిదారులను అల్లీపురం టిట్కో ఇళ్లకు తీసుకొచ్చారు. ఇంటి పట్టాలలోపాటు, తాళాలు అందిస్తామని, వేలాది మంది లబ్ధిదారులకు ఉదయం 8 గంటలకే తరలించారు. ఇంటి పట్టాలు, తాళాలు ఇస్తారని మహిళల పెద్ద ఎత్తున తరలివచ్చారు. మంత్రి ఆదిమూలం సురేష్, కాకాణి గోవర్ధన్‌రెడ్డి, ఎంపి ఆదాల ప్రభాకర్‌రెడ్డి ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. జగన్మోహన్‌రెడ్డి గృహాలు నిర్మించారని, పేదలకు అందించడానికే పనిచేశారని, ఆయనున్న వచ్చే ఎన్నికల్లో ఆదరించాలని నేతలు పిలుపునిచ్చారు. సుదీర్ఘ ఉపనాస్యం తరువాత ఇద్దరి, ముగ్గరి మాత్రమే పట్టాలిచ్చి, తాళాలు అందించారు. పోటోలు తీయించుకున్న తార్వత అక్కడ నుంచి మంత్రులు వెళ్లిపోయారు. పట్టాలు ఎవరు ఇస్తారో తెలియక, వేలాది మంది మహిళలు నిరీక్షించారు. గత ప్రభుత్వంలో ఇళ్లు నిర్మిస్తే, వాటికి పట్టాలు ఇవ్వడానికి ఇన్ని రోజులు పట్టిందని, మళ్లీ ఇప్పుడు పిలిచి ఇవ్వకుండా మాటలు చెబుతున్నారంటూ మహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓ లబ్ధిదారుడు ఏకంగా వేదిక మీదకు వచ్చిన తనకు ప్రభుత్వం ఇచ్చిన పట్టాలను మీడియా ముందు చింపేశారు. తనకు ఇళ్లు వద్దు, ఏమీ వద్దంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు నివారిస్తున్నా పట్టించుకోలేదు. ఈ సమావేశానికి వచ్చిన లబ్ధిదారులందరూ నిరాశగా తిరిగి వెళ్లిపోయారు. ఇంటి పట్టాలు ఇస్తారో లేదో తెలియక వెనుతిరిగారు.

బాతుల వ్యాపారి నయవంచన..!

-నగదు ఆశచూపి ఇద్దరు గిరిజన బాలల తరలింపు

-ఎనిమిది నెలలుగా కనిపించని చిన్నారులు

-పోలీసులను ఆశ్రయించిన గిరిజన దంపతులు

ప్రజాశక్తి -గుడ్లూరు : బాతుల వ్యాపారి నయ వంచనకు గిరిజన దంపతులు మోస పోయారు. తీవ్ర పేదరికంలో ఉన్న వారు ఆ వంచకుడు చెప్పిన మాటలను నమ్మి తమ బిడ్డలను బాతుల దగ్గర కాపలా ఉండేందుకు పంపించారు. చివరకు ఎనిమిది నెలలుగా వారి ఆచూకీ తెలియక పోవడంతో ఆ దంపతులు బుధవారం పోలీ సులను ఆశ్రయించారు. ఆ వివరాలు ఇలా ఉన్నాయి.

మండలంలోని నరసాపురం గిరిజన కాలనీకి చెందిన తలపల శ్రీనివాసరావు, అంజమ్మ భార్యాభర్తలు. వారు తమ గ్రామం పక్కనే ఉన్న ముత్తావారిపాలెంలో మామిడి తోటలకు కాపలా ఉంటూ జీవనం సాగిస్తున్నారు. వారి పిల్లలు తలపల అంకుల్ అమ్మ, వెంగళరావు చిన్నపిల్లలు. వారిని తమ దగ్గరే ఉంచుకొని సంరక్షించుకుంటున్నారు. ముత్తావారిపాలెం గ్రామానికి చెందిన పేరం కోటేశ్వరరావు బాతుల వ్యాపారం చేస్తుంటాడు. ఆ చిన్నారులను చూసిన ఆయన బాతుల దగ్గర కాపలా ఉండేందుకు ఆ ఇద్దరు చిన్నారులను పంపాలని, నెల రోజుల తర్వాత తిరిగి మీకు అప్పగిస్తానని చెప్పి రూ. 5, వేలు నగదును ఆ గిరిజన దంపతులకు ఇచ్చాడు. దీంతో వారు తమ చిన్నారుల్ని బాతులు వ్యాపారికి అప్పగించారు. వారిని బాతుల దగ్గర కాపాలకంటూ తీస ుకెళ్లిన కోటేశ్వరరావు తర్వాత కనిపించలేదు. దీంతో రెండు నెలల తర్వాత బాతులు వ్యాపారి కోసం వెతుకు లాడారు. చివరకు ఆయన కనిపించలేదు. చివరకు కని పించడంతో ఆయన్ను నిల దీశారు. తూర్పు గోదావరి జిల్లా, అత్తిలిలో బాతుల్ దగ్గర కాపలా ఉంచామని, త్వరలో మిమ్మల్ని కూడా తీసుకెళ్తానని, నమ్మబలికి అనంతరం కనిపిం చకుండా పోయాడు. దీంతో చిన్నారుల తల్లిదండ్రులు అత్తిలి వెళ్లారు. అక్కడ తమ బిడ్డలు కనిపిం చలేదు. బాతులు వ్యాపారు లందరికీ దగ్గర వెతుకులాడారు. ఎనిమిది నెలలపాటు వెతుకు లాడినా ఎక్కడా కనిపిం చకపోవడంతో చివరకు గుడ్లూరు పోలీస్టే షన్‌కు చేరుకుని పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేసి బాధితులకు న్యాయం చేస్తామని హామీనిచ్చారు.

ఫిర్యాదు ప్రతులను చూపుతున్న గిరిజన దంపతులు

సచివాలయంలో చోరీ

గుడ్లూరు :మండలంలోని అమ్మవారిపాలెం సచివాలయంలో రూ. 2 లక్షల విలువైన పరికరాలు చోరీకి గురైనట్లు సచివాలయం సిబ్బంది గుడ్లూరు పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేశారు. స్పందించిన పోలీసులు పోలీసులు కేసు దర్యాప్తు ప్రారంభించారు కంప్యూటర్‌కు చెందిన రెండు మానిటర్లు, ఒక ప్రింటర్ ఒక జిరాక్స్ మిషన్ తదితర పరికరాలు కనిపించకుండా పోయాయని గుర్తించారు. త్వరలోనే నిందితులను పట్టుకుంటామని ఎస్ఐ లక్ష్మణ్ రావు తెలిపారు.

ఉద్యోగ సంఘాల నాయకులకు సన్మానం

నెల్లూరు : ఎపి జిఇఫ్ రాష్ట్ర ఛైర్మన్ కాకర్ల వెంకటరామి రెడ్డి, ఆ సంఘం రాష్ట్ర జనరల్ సెక్రెటరీ అరుణ్ పాల్‌ను ఉద్యోగ సంఘాల నాయకులు ఎపిజిఇఎఫ్ జిల్లా ఛైర్మన్ చేజెర్ల సుధాకర్ రావు ఆధ్వర్యంలో సన్మానించారు. బుధ వారం జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు మాట్లాడుతూ కాకర్ల వెంకట రామిరెడ్డి నిస్వా ర్థంగా ఉద్యోగులకు సేవలందించారని కొని యాడారు. ఉద్యోగ సంఘ నాయ కులు జయ ప్రకాష్, కోటే శ్వరరావు, హరి ప్రసాద్, సుబ్బా రావు, శ్రీని వాసులు, అనురాధ, లక్ష్మి కుమారి, రామచంద్రయ్య ఉన్నారు.

కంటైనర్ టెర్మినల్ తరలింపు సరికాదు

రౌండ్ టేబుల్ సమావేశంలో కార్మిక, రైతు, ప్రజా సంఘాల నాయకులు

ప్రజాశక్తి-నెల్లూరు : కష్ణపట్నం పోర్టుకు సంబంధించి కంటైనర్ టెర్మినల్ చెన్నయ్‌కి తరలించాలని ప్రభుత్వ నిర్ణయం తీసుకోవడం దుర్మార్గమని, తక్షణమే ఈ ఆలోచన విరమించుకోవాలని కార్మిక, రైతు, ప్రజా సంఘాల ప్రతినిధులు డిమాండ్ చేశారు. బుధవారం నగరంలోని జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో కార్మిక, రైతు, ప్రజా సంఘాల ప్రతినిధులు రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎఐఎఫ్‌టియు (న్యూ) నాయకులు లక్ష్మిరెడ్డి అధ్యక్షత వహించారు. నాయకులు మాట్లాడుతూ కంటైనర్ టెర్మినల్ తరలింపుతో రాష్ట్రానికి పన్నుల రూపేణా వచ్చే ఆదాయం నష్టపోతున్నా సిఎం ముఖ్యమంత్రి ఉదాసీనంగా వ్యవహరించడం సరికాదన్నారు. వేలాదిమంది ఉద్యోగులకు ఉపాధినిచ్చే కంటైనర్ టెర్మినల్‌ను మూసివేస్తూ ప్రభు త్వం నిర్ణయం తీసుకోవడం సరికాదన్నారు. ఇప్పటికే పోర్టును మూసేస్తున్నట్లు ఆన్‌లైన్ సందేశాలను పోర్టు యాజ మాన్యం పంపించిందన్నారు. పోర్టు మూసివేస్తున్నట్లు ఇ మెయిల్స్ పంపినది నిజం కాకపోతే ఏడాదికి సరిపడా షెడ్యూల్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. రౌండ్‌టేబుల్ సమావేశంలో సిఐటియు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు టివి వి ప్రసాద్, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె అజయ్‌కుమార్, సిఐటియు నాయకులు కె పెంచల నరసయ్య, జి. నాగేశ్వరరావు, కష్ణపట్నం పోర్టు కార్మిక సంఘం నాయకులు గోగుల శ్రీనివాసులు, ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు ఎస్ కె జిలాని, ఎఐఎఫ్టీయూ నాయకులు యానాదయ్య, యుటిఎఫ్ నాయకులు చలపతి శర్మ, టిఎన్ టి యు సి నాయకులు కళ్యాణ్, రైతు సంఘం నాయకులు ఎస్ కె షాన్వాజ్, టి లీలా మోహన్, ఎస్.కె ముక్తియార్, ఫక్రుద్దీన్, ఐఎఫ్టియు నాయకులు రాంబాబు, ఓపిడిఆర్ నాయకులు శివశంకర్, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె అజయ్‌కుమార్

ప్రజలతో సఖ్యతగా మెలగాలి : ఎస్‌పి

ప్రజాశక్తి - నెల్లూరు :ప్రజలతో సామరస్యంగా, సఖ్యతతో ఉంటూ చట్టంపై గౌరవం పెంపొం దేటట్లు విధులు నిర్వహించాలని పోలీస్ సిబ్బందికి ఎస్‌పి డాక్టర్ కె తిరుమ లేశ్వర్ రెడ్డి సూచించారు. బుధవారం ఉమేష్ చంద్ర కాన్ఫరెన్స్ హాలులో జిల్లా పోలీసు అధికారులతో నెలవారీ నేర సమీక్ష నిర్వహించారు. ముందుగా జిల్లాలో చోటు చేసుకున్న పెండింగ్ గ్రేవ్, నాన్ గ్రేవ్, అస్తి సంబంధిత నేరాలలో విచారణ గురించి సర్కిల్ వారీగా అధికారులతో సమీక్ష నిర్వహించారు. పోలీసు అధికారులు సిబ్బంది నిష్పక్షపాతంగా ఎలాంటి అలసత్వం లేకుండా ఎన్నికల విధులు నిర్వహించాలన్నారు. వీధి నిర్వహణలో ఎవరైనా అత్యుత్సాహం ప్రదర్శిస్తే శాఖా పరమైన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎన్నికల ట్రబుల్ మాంగర్స్, రౌడీ షీటర్లను వెంటనే బైండోవర్ చేసి, వారి కదలికలపై ప్రత్యేక నిఘా పెట్టాలని కోరారు. లైసెన్సుడ్ ఆయుధాలను వెంటనే ఎస్ హెచ్‌లు పోలీస్ స్టేషన్లలో డిపాజిట్ చేయించుకుని, ఎలక్షన్ కోడ్ ఉన్నంత వరకు భద్ర పరచాలన్నారు. నేర నియంత్రణ విషయంలో సమిష్టి కషి, సమన్వయంతో పనిచేయాలని అధికారులకు దిశా నిర్ధేశనం చేశారు. అసాంఘిక కార్య కలాపాలైన పేకాట, కోడి పందాలు, నాటు సారా, డ్రంక్ అండ్ డ్రైవ్ వంటిపై సమీక్షించారు.

మాట్లాడుతున్న ఎస్‌పి

పొదలకూరు : పట్టణంలోని గాయత్రి విద్యామందిర్‌లో వసంత పంచమిని పురస్కరించుకుని బుధవారం సామూహిక అక్షరభ్యాసం ఘనంగా నిర్వహించారు. కరస్పాండెంట్ చైతన్య కుమార్ రెడ్డి మాట్లాడుతూ తమ స్కూల్ లో ప్రతి ఏటా ఈ అక్షరభ్యాసం చేయడం ఆనవాయితీగా వస్తుందన్నారు. ప్రిన్సిపాల్ చంద్రబాబు, ఏడుకొండలు, ఉపాధ్యాయులు బాబు, చిన్నయ్య, శ్రీను, కామాక్షి, విజయలక్ష్మి, ప్రసన్న, అనూష ఉన్నారు.

ఉలవపాడు : శ్రీ సాయి పాఠశాలలో బుధవారం వసంత పంచమి సందర్భంగా అక్షరాభ్యాస కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రిన్సిపాల్ మౌనిక, విద్యార్థులు ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పలుచోట్ల అక్షరభ్యాసం

పొదలకూరు : పట్టణంలోని గాయత్రి విద్యామందిర్‌లో వసంత పంచమిని పురస్కరించుకుని బుధవారం సామూహిక అక్షరభ్యాసం ఘనంగా నిర్వహించారు. కరస్పాండెంట్ చైతన్య కుమార్ రెడ్డి మాట్లాడుతూ తమ స్కూల్ లో ప్రతి ఏటా ఈ అక్షరభ్యాసం చేయడం ఆనవాయితీగా వస్తుందన్నారు. ప్రిన్సిపాల్ చంద్రబాబు, ఏడుకొండలు, ఉపాధ్యాయులు బాబు, చిన్నయ్య, శ్రీను, కామాక్షి, విజయలక్ష్మి, ప్రసన్న, అనూష ఉన్నారు.

ఉలవపాడు : శ్రీ సాయి పాఠశాలలో బుధవారం వసంత పంచమి సందర్భంగా అక్షరాభ్యాస కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రిన్సిపాల్ మౌనిక, విద్యార్థులు ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు

అరాచక పాలనకు అంతం మొదలు..

ప్రజాశక్తి-ఉదయగిరి : రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి అరాచక పాలనకు చరమగీతం పాడే రోజులు దగ్గరలో ఉన్నాయని టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ మాజీ జెడ్పి ఛైర్మన్ పి.చెంచల బాబు యాదవ్ దుయ్యబట్టారు. బుధవారం స్థానిక చెంచల బాబుయాదవ్ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ త్వరలోనే వైసిపి ఖాళీ కాబోతుందని జిల్లాలో పది స్థానాలు టిడిపి గెలుపు తథ్యమని అన్నారు. నిత్యావసర వస్తువులు, కరెంటు ఛార్జీలు, ఆర్టీసి ఛార్జీ లు, మద్యం ధరలు ప్రజలు విసిగి వేసి పోయారని, రాజధాని లేని రాష్ట్రంగా ఆంధ్రా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. వైవి సుబ్బారెడ్డి హైదరాబాదును రాజధాని గా ఉండాలని చెప్పడం హాస్యాస్పదంగా ఉందని, ఎప్పుడు ఎన్నికలు వస్తాయో చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి కావాలని ప్రజలు కోరుకుంటున్నార న్నారు. మండల అధ్యక్షులు బయన్న యాదవ్, టిఎన్ఎస్ఎఫ్ మండల అధ్యక్షులు మాబాషా, సురేష్, రాజా, బాలకొండయ్య, మస్తాన్, రామ్మోహన్, హరీష్ పాల్గొన్నారు.

క్రిమినల్ చట్టం 106 (1)(2) రద్దు చేయాలి

ప్రజాశక్తి-కోవూరు : భారతీయ న్యాయ సంహిత క్రిమినల్ చట్టం 106 (1)(2) రద్దు చేయాలని నెల్లూరు జిల్లా లారీ ఓనర్ అసోసియేషన్, లారీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో లోకల్ అదాలత్ మేజిస్ట్రేట్ కె.వాణికి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఈ చట్టం రవాణా రంగ కార్మికుల మెడకు ఉరితాడుగా మారు తుందన్నారు. ప్రమాదవశాత్తు జరిగిన సంఘటనకు డ్రైవర్లను బాధ్యులుగా చేస్తూ రూ.10లక్షలు జరిమానా, పదేళ్ళ జైలు శిక్ష విధించడం దుర్మార్గమని తెలిపారు. ఈ నిర్ణయం కారణంగా దేశంలోని 12కోట్ల పైగా రవాణా రంగ కార్మికులు జైలు పాలవుతున్నారన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్పొరేటర్లకు లాభాలు చేకూర్చేందుకు ఈ చట్టం తెచ్చిందని మండిపడ్డారు. ఈ చట్టం రద్దుకు ప్రభుత్వానికి సిఫార్సు చేయాలని మేజిస్ట్రేట్‌ను కోరారు. కార్యక్రమంలో ఓనర్స్ అసోసియేషన్, డ్రైవర్స్ యూనియన్ నాయకులు చిన్నారెడ్డి, కొండస్వామి నాయుడు, దామోదర్‌రెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, మల్లికార్జున రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

'డిబిఎస్'లో రక్తదాన శిబిరం

ప్రజాశక్తి-కావలి : డి.బి.ఎస్. ఇంజనీరింగ్ కళాశాలలో 16వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా బుధవారం కళాశాల సెక్రటరీ డాక్టర్ దామిశెట్టి బాల సురేష్‌బాబు, కరెస్పాండెంట్ దామిశెట్టి.సుధీర్ నాయుడు కళాశాల ఆవరణలో రక్తదాన శిబిరం నిర్వహించారు. రక్తదాన ప్రాధాన్యతను సమావేశం కళాశాల సెక్రటరీ డాక్టర్ దామిశెట్టి బాలసురేష్ బాబు పేర్కొన్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని ఆయన మాట్లాడుతూ కళాశాల స్థాపించి 15 సంవత్సరాలు పూర్తిచేసుకొని 16వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భాన్ని పురస్కరించుకొని 50మంది కళాశాల విద్యార్థులు స్వచ్ఛందంగా రక్తదానం చేయడం అభినంద నీయమని కొనియాడారు. విద్యార్థులు సేవ కార్యక్రమాలు పాల్గొనడం హర్షించదగిన విషయమని తెలిపారు. కళాశాల కరెస్పాండెంట్ దామిశెట్టి సుధీర్‌నాయుడు మాట్లాడుతూ నేటి కాలంలో రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు మనిషికి అత్యవసరంగా అవసరమయ్యేది రక్తమే! కావున రక్తదానం ఎదుటి వ్యక్తి ప్రాణాలు నిలుపుతుందని, కావున రక్తదానం చేయడం ప్రతి విద్యార్థి సేవాదృక్పథంగా భావించాలని కోరారు. కళాశాల వ్యవస్థాపక దినోత్సవ సందర్భంగా ఇటువంటి గొప్ప సేవ కార్యక్రమాలు ప్రతిసంవత్సరం చేపట్టే ఉన్నామని ఇది హర్షించదగిన విషయమని తెలియజేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.వి.రావు మాట్లాడుతూ రక్తదానం మనిషి జీవితాన్ని కాపాడుతుందని ప్రతి విద్యార్థి సమాజ సేవ దృక్పథం కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల పరిపాలన అధికారి జి.రమేష్ బాబు, అన్నివిభాగాల అధిపతులు విద్యార్థులు పాల్గొన్నారు.

ఇండిపెండెంట్‌గా పోటీ చేస్తా : పసుపులేటి

ప్రజాశక్తి-ఉదయగిరి : తాను బి.సి.ని కాబట్టి, తనకు ఎన్నికల్లో టికెట్ ఇచ్చేందుకు ప్రధాన రాజకీయ పార్టీలు నిరాకరించాయని, కనుక కావలి నియోజకవర్గంలోని బి.సి. ఇతర వెనుకబడిన కులాల ప్రజల ఆదరణతోనే లోకల్ అభ్యర్థిగా, స్వతంత్ర అభ్యర్థిగా రానున్న 2024 సార్వత్రిక ఎన్నికల్లో పోటీచేసి, గెలుస్తానని పి.ఎస్.ఆర్. చారిటబుల్ ట్రస్ట్ అధినేత పసుపులేటి సుధాకర్ ధీమాగా ప్రకటించారు. బుధవారం స్థానిక మినీస్టేడియం మైదానంలో ఆయన ఆధ్వర్యంలో " కావలి కదిలింది" పేరుతో ఆయన ఐడుగు, బలిజ వర్గాల ప్రజలను దాదాపు 6వేలమందికి పైగా జనసమీకరణ చేసి, భారీ బహిరంగ సభ నిర్వహించారు. ఈ సభలో ఆయన ప్రధాన ప్రసంగం చేస్తు తన దిశా నిర్దేశాన్ని ప్రకటించారు. తాను 2019లో జనసేన పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి, కావలి నియోజకవర్గ ప్రజలు 15వేలకు పైగా ఓట్లు వేసి ఆదరించారని, అందుకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఒక ప్రధాన పార్టీ నాయకులు తనకు పార్టీ టికెట్ ఇస్తామని ఆశ పెట్టి, చివరకు టికెట్ ఇవ్వలేదన్నారు. ఎందుకంటే తాను బి.సి.ని కనుక గ్రావెల్ మాఫియా చెయ్యలేనని, ఇసుక అక్రమంగా అమ్మలేనని, భూకబ్జాలు చెయ్యలేదని తనను గుర్తించలేదని వాపోయారు. తాను గత 5సంవత్సరాలుగా చేస్తున్న సేవలను గుర్తించిన ప్రజలు తనను తప్పకుండా పోటీ చేయాలని, తామే గెలిపించుకుంటామని ప్రోత్సహించారని, అందుకే ఇండిపెండెంట్ గా పోటీ చేస్తున్నానని, ప్రజలు తనను దీవించాలని కోరారు. ఈ సందర్భంగా పలువురు బి.సి. నాయకులు పసుపులేటి సుధాకర్‌ను ఘనంగా సత్కరించారు.

చంద్రబాబును కలిసిన కావ్య క్రిష్ణారెడ్డి, మాలేపాటి

- భారీ మెజారిటీతో గెలిపించి కానుకగా ఇస్తానని చంద్రబాబుకు మాలేపాటి హామీ

ప్రజాశక్తి-కావలి : టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర ఆధ్వర్యంలో కావలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కావ్య క్రిష్ణారెడ్డి, మాజీ ఇన్‌ఛార్జి మాలేపాటి సుబ్బానాయుడు బుధవారం టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడును మంగళగిరి లోని పార్టీ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన క్రిష్ణారెడ్డిని చంద్రబాబు అభినందించారు. నూతన ఉత్సాహంతో ముందుకు వెళ్లాలని చంద్రబాబు తెలిపారు. కావలి నియోజకవర్గంలో తెలుగుదేశం జెండా ఎగరవేస్తామని కావ్య క్రిష్ణారెడ్డి గెలుపు బాధ్యత తీసుకుంటానని మాలేపాటి సుబ్బానాయుడు చంద్రబాబుకు హామీనిచ్చారు. అత్యధిక మెజార్టీతో కావ్య క్రిష్ణారెడ్డిని గెలిపిస్తామని కావలి నియోజకవర్గాన్ని కానుకగా అందజేస్తామని చంద్రబాబు కు హామీనిచ్చారు. అందరూ కలిసికట్టుగా పనిచేసి కావలిలో తెలుగుదేశం జెండా రెపరెపలాడించాలని చంద్రబాబు కోరారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి పమిడి రవికుమార్ చౌదరి, రాష్ట్ర కార్యదర్శి మలిశెట్టి వెంకటేశ్వర్లు, రాష్ట్ర ఐ.టి.ఎస్. బోర్డు మాజీ డైరెక్టర్ మాలేపాటి రవీంద్ర నాయుడు, మండల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి ఎంపిక



ప్రజాశక్తి-ఉదయగిరి : జిల్లాస్థాయిలో జరిగిన సైన్స్ ఇన్‌స్పైర్ మనక్ ఉదయగిరి ఎంపి యుపిఎస్ బిసి ఉర్దూ పాఠశాల విద్యార్థి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారని ఉపాధ్యాయులు షేక్.సర్దార్ తెలిపారు. పాఠశాల నుంచి తమ విద్యార్థులు జిల్లాస్థాయి సైన్స్ ఇన్‌స్పైర్‌లో పాల్గొని రెండు అవార్డులు అందుకున్నారని ఆయన తెలిపారు. స్మార్ట్ కార్ పార్కింగ్ ప్రదర్శన షేక్ షఫీయాన్ రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు ఆయన తెలిపారు. అదే విధంగా మహిళ రక్షణ ప్రదర్శన షేక్ షంషీర్ ఎంపికైందన్నారు. వీరు ఇరువురు పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నారు. అనంతరం విద్యార్థుల ఎంపిక పై ఉపాధ్యాయ బృందం విద్యార్థులను అభినందించే సభ నిర్వహించి ఎంపికైన విద్యార్థులకు సైన్స్ ఉపాధ్యాయులు షేక్.ఎస్‌తాజ్ విద్యార్థులకు సహకారం అందించినందుకు అధ్యాపక బృందం అభినందించారు. 18న రాష్ట్రస్థాయిలో జరిగే సైన్స్ ఇన్‌స్పైర్ ప్రదర్శనలో నిలవాలని వారు ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేటి నుంచి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు

ప్రజాశక్తి-వరికుంటపాడు : జాతీయ రహదారి పక్కనే నూతనంగా నిర్మించిన వెంకటేశ్వర స్వామి ఆలయంలో గురువారం నుంచి ఐదు రోజులపాటు శ్రీ శ్రీ పద్మావతి గోదా సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు వైభవంగా జరుగుతాయని అమ్మ ఫౌండేషన్ వ్యవస్థాపకులు పెద్దాల సూర్యనారాయణ - అమ్మాజీ దంపతులు తెలిపారు. ఈ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు ఐదు రోజులపాటు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. భక్తులందరూ అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొంది తీర్థ ప్రసాదాలు స్వీకరించాలన్నారు.

16న గ్రామీణ భారత్ బంద్, పారిశ్రామిక సమ్మె

జయప్రదం చేయాలని రైతుసంఘాలు, ప్రజాతంత్రవాదులు, వామపక్ష పార్టీల పిలుపు

కావలిలో మాట్లాడుతున్న నాయకులు

ప్రజాశక్తి-కావలి రూరల్

16వ తేదీన జరిగే గ్రామీణ భారత్ బంద్, పారిశ్రామిక సమ్మెను విజయవంతం చేయాలని వామపక్ష పార్టీల నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం సిపిఎం ఆఫీసులో వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సిపిఎం నాయకులు పసుపులేటి పంచలయ్య, సిపిఐ నాయకులు కె నరసింహారావు, సిపిఐ (ఎంఎల్) నాయకులు ఎల్ లక్ష్మిరెడ్డి, సిపిఐ ఎల్ఎం న్యూ డెమోక్రసీ నాయకులు కె.భాస్కర్ పాల్గొని మాట్లాడారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రభుత్వరంగ సమస్యలను ప్రయివేటీకరణ చేస్తూ ఇబ్బందికరమైన నాలుగు లేబర్ కోడ్లు తీసుకొచ్చిందని, కార్మిక చట్టాలను కుదించిందని వ్యవసాయ రంగాన్ని కార్పొరేటర్లకు ధారాదత్తం చేయాలని ప్రయత్నిస్తుందని కార్మికుల, ఉద్యోగుల శ్రమను దోచుకుంటుందని తెలిపారు. ముఖ్యంగా పెరిగిన ధరలతో ప్రజలు కొని తినలేక అల్లాడిపోతున్నారన్నారు. మోడీ ప్రభుత్వం పెరిగిన ధరలు తగ్గించడంలో విఫలమైందని, రైతులకు, ఇళ్లకు స్మార్ట్ విద్యుత్ మీటర్లను బిగించి ప్రజల వద్ద నుంచి దోచుకోవాలని చూస్తుందని విమర్శించారు. ప్రజా, కార్మిక, ఉద్యోగ వ్యతిరేక విధానాలను అవలంభిస్తుందని ఈ విధానాలపై 16న జరిగే గ్రామీణ భారత్ బంద్, పారిశ్రామిక సమ్మెలో అన్ని రంగాల ప్రజలు కార్మికులు ఉద్యోగులు రైతులు పాల్గొని జయప్రదం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. సమావేశంలో స్త్రీ విముక్తి సంఘటన జిల్లా నాయకులు ఎల్ శ్యామల, సిఐటియు నాయకులు బి.కృష్ణయ్య, తదితరులున్నారు.

జలదంకిలో...

ప్రజాశక్తి-జలదంకి : దేశవ్యాప్తంగా 16న జరిగే గ్రామీణ భారత్ బంద్, పారిశ్రామిక సమ్మెను జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు తాళ్లూరు మాల్యాద్రి ప్రజలకు పిలుపునిచ్చారు. బుధవారం జలదంకిలోని సురే చెంచురెడ్డి భవనంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బిజెపి ప్రభుత్వం వ్యవసాయం నుంచి రైతులను బయటకు నెట్టివేసి దాన్ని కార్పొరేట్లకు దారాగత్తం చేసేందుకు, కార్మికుల ఉద్యోగుల శ్రమను కార్పొరేట్లకు కారుచౌకగా కట్టబెట్టేందుకు చట్టాలు చేసిందన్నారు. బిజెపి చేస్తున్న కార్మిక రైతాంగం ప్రజా వ్యతిరేక చర్యలను నిరసిస్తూ ఫిబ్రవరి 16వ తేదీన దేశవ్యాప్తంగా గ్రామీణ బంద్, పారిశ్రామిక సమ్మెను నిర్వహించాలని సంయుక్త కిసాన్ మోర్చా, కార్మిక సంఘాల ఐక్యవేదిక పిలుపును ఇచ్చాయన్నారు. నాలుగు లేబర్ కోడులను రద్దు చేయాలని, రైతులు పండించిన అన్ని పంటలకు స్వామినాథన్ సిఫారసుల మేరకు కనీస మద్దతు ద్వారా నిర్ణయించి, ధరలు అమలయ్యేలా పార్లమెంటులో చట్టం చేయాలన్నారు. రైతుల రుణాలు రద్దుచేసి రైతులను విముక్తులను చేయాలన్నారు. 2022లో కేంద్రం ప్రవేశపెట్టిన విద్యుత్ బిల్లును ఉపసంహరించుకోవాలన్నారు. వ్యవసాయ పంపు సెట్లకు, గృహాలకు, స్మార్ట్ విద్యుత్ మీటర్ల బిగింపు ప్రక్రియ వెంటనే ఆపాలని, ఆహార భద్రత చట్టం వెంటనే అమలు చేయాలని, భూములు సాగు చేస్తున్న వాస్తవ కవులు రైతులకే నష్టపరిహారం ఇవ్వాలని, బీమా సౌకర్యం, రుణ సౌకర్యం కల్పించాలన్నారు. ఉపాధి హామీ చట్టం సక్రమంగా అమలు చేయాలని, కేంద్ర బడ్జెట్లో రూ.2లక్షల కోట్లు కేటాయించాలని, జాబు కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ 200 పని దినాలు కల్పించాలని, దినసరి కూలీ రూ.600 ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వ్య.కా.సం. జిల్లా అధ్యక్షులు దమ్ము దర్గాబాబు, జిల్లా రైతు సంఘం కమిటీ మెంబర్ రావి మాల్యాద్రి, మండల వ్యకాసం కార్యదర్శి ఆంథోని బాబు, తదితరులున్నారు.

ఆత్మకూరులో మాట్లాడుతున్న నాయకులు

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : కార్మిక, కర్షక, ప్రజా సమస్యల పరిష్కారం కోసం 16వ తేదీ శుక్రవారం చేపడుతున్న గ్రామీణ భారత్ బంద్, పారిశ్రామిక సమ్మెను జయప్రదం చేయాలని ఆత్మకూరు సిఐటియు, రైతుసంఘం, కౌలు రైతుసంఘం నాయకులు పిలుపునిచ్చారు. బుధవారం పట్టణంలోని చెర్లో రమణారెడ్డి భవన్‌లో సమావేశం నిర్వహించి మాట్లాడారు. కేంద్రంలో మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత వ్యవసాయం నుండి రైతులను బయటకు నెట్టివేసి దాన్ని కార్పొరేట్లకు ధారాదత్తం చేసేందుకు, కార్మికుల, ఉద్యోగుల శ్రమను కార్పొరేట్లకు కారుచౌకగా కట్టబెట్టేందుకు బిజెపి ప్రభుత్వం చట్టాలు చేస్తుందని విమర్శించారు. ఆ మేరకు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం చేస్తున్న కార్మిక, రైతాంగ, ప్రజావ్యతిరేక చర్యలను నిరసిస్తూ పలు డిమాండ్ల సాధనకు గ్రామీణ భారత్ బంద్‌ను నిర్వహించాలని సంయుక్త కిసాన్ మోర్చా సంఘాల ఐక్యవేదిక పిలుపునిచ్చినట్లు తెలియజేశారు. 16వ తేదీ ఉదయం 11 గంటలకు ఆర్‌టిసి బస్టాండ్ నుండి ర్యాలీ బయల్దేరుతుందన్నారు. కార్యక్రమానికి రైతులు, కార్మికులు ప్రజాతంత్ర వాదులు, రైతు సంఘాలు, పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు జి వి శివప్రసాద్, సిఐటియు అధ్యక్ష కార్యదర్శులు ఆత్మకూరు నాగయ్య, కొండమూరి హజరత్తయ్య, జిల్లా కౌలురైతు సంఘం నాయకులు గంటా లక్ష్మీపతి, ఎపి రైతుసంఘం అధ్యక్ష కార్యదర్శులు, లక్కు కృష్ణ ప్రసాద్, కృష్ణమోహన్, సిపిఎం పట్టణ కార్యదర్శి కొప్పోలు డేవిడ్ రాజు, తదితరులున్నారు.

రైతులతో రైతుసంఘాలు సమావేశం :

గ్రామీణ భారత్ బంద్‌ను విజయవంతం చేయడానికి పట్టణంలోని పేరారెడ్డి పల్లె గ్రామ రైతులతో రైతుసంఘాల నాయకులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు సంఘం నాయకులు రైతులతో మాట్లాడుతూ 16వ తేదీ జరగబోయే దేశవ్యాప్త బంద్ గురించి దాని ప్రాముఖ్యత ఢిల్లీలో జరిగే రైతాంగ ఉద్యమం ల్యాండ్ టైటిల్ యాక్ట్, వ్యవసాయ మోటార్లకు మీటర్లు తదితర అంశాలపై రైతులకు వివరించారు.

పోస్ట్‌కార్డులు చూపుతున్న ఉపాధ్యాయులు

ఒపిఎస్ అమలుకు పోస్ట్‌కార్డులు

ప్రజాశక్తి-అనంతసాగరం

సిపిఎస్‌ను రద్దు చేసి ఒపిఎస్‌ను అమలు చేసేలా రాజకీయ పార్టీలు, పార్టీల అధ్యక్షులకు యుటిఎఫ్ ఆధ్వర్యంలో పోస్ట్ కార్డులు రాశామని మండల అధ్యక్షులు వెంకటేశ్వర్లు రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈసారి ఉద్యోగులు మోసపోవడానికి సిద్ధంగా లేరని, ఏ పార్టీ అయితే మేనిఫెస్టోలో సిపిఎస్‌ను రద్దు చేసి ఒపిఎస్‌ను అమలుచేస్తామని ప్రకటిస్తారో ఆ పార్టీకి ఉద్యోగులు మద్దతిస్తామన్నారు. ఉద్యోగులకు రావాల్సిన పిఎఫ్, ఎపిజిఎల్, లోన్స్, క్లోజర్స్ పరిస్థితి దారుణంగా ఉన్నాయన్నారు. గతంలో ఎప్పుడు ఇలాంటి పరిస్థితులు లేవన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు జి.శ్రీనివాసులు, సిపిఎస్ నాయకులు నాగరాజు, వెంకటసుబ్బయ్య, తిరిపాలు, గౌస్‌బాషా, గురుప్రసాద్, సురేంద్ర, రాజ్యలక్ష్మి, శైలజ, రిహ్నాబాయి, లక్ష్మి, శ్రావణి, ప్రతాప్, తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఇళ్లు పరిశీలన

ప్రజాశక్తి-కావలి రూరల్

మండల పరిధిలోని రాజువారి చింతలపాలెం నిర్మిస్తున్న జగనన్న కాలనీలను బుధవారం హౌసింగ్ థర్డ్‌పార్టీ క్వాలిటీ కంట్రోల్ అధికారి ఎస్‌కె.కరిముల్లా స్వయంగా పరిశీలించారు. మండల పరిధిలో హౌసింగ్ అధికారులు పెట్టిన బిల్స్, గ్రౌండ్ లెవెల్‌లో జరుగుతున్న జగనన్న కాలనీల్లో పనులను ఆయన పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. త్వరగా పనులు పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో హౌసింగ్ డిఇ ఖాజామొహిద్దీన్, ఎఇ నరేంద్ర రెడ్డి, కొత్తపల్లి ఇంజనీరింగ్ అసిస్టెంట్ పి రాఘవ, వర్క్ ఇన్‌స్పెక్టర్ సీనయ్య పాల్గొన్నారు.

సాగునీరిచ్చి రైతాంగాన్ని ఆదుకోవాలి

ప్రజాశక్తి-జలదంకి : చిన్నక్రాక రిజర్వాయర్ కింద ప్రాంతంలో ఉన్న చెరువులకు, మేజర్లకు సోమశిల నీటిని విడుదల చేసి వరి పంటలు సాగుచేసిన రైతాంగాన్ని ఆదుకోవాలని సిపిఎం సీనియర్ నాయకులు తాళ్లూరు మాల్యాద్రి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం జలదంకిలోని సురే చెంచురెడ్డి భవనంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. జలదంకి పెద్ద చెరువు, టెంకవారిపాలెం, ఎల్ఆర్ అగ్రహారం చెరువులకింద సాగులో ఉన్న వరిపంట ఎండు ముఖం పట్టిందని త్వరితగతిన సాగునీరు అందకపోతే పంటలు ఎండుతాయని రైతన్నలు తీవ్రంగా నష్టపోతారన్నారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు సమన్వయంతో పనిచేసి రైతన్నలను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. సిపిఐ నాయకులు దమ్ము దర్గాబాబు, జిల్లా రైతుసంఘం కమిటీ మెంబర్ రావి మాలాద్రి, మండల వ్య.కా.సం. కార్యదర్శి ఎం.ఆంథోనీ బాబు పాల్గొన్నారు.

జెవివి ఆధ్వర్యంలో చిత్రలేఖన పోటీలు

మాట్లాడుతున్న జెవివి నాయకులు

ప్రజాశక్తి-కావలి : కావలి పట్టణ జెవివి ఆధ్వర్యంలో సైన్స్-డే వారోత్సవాలలో భాగంగా బుధవారం విజయ వంతంగా చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. జూనియర్లకు మా ఇంటి పెరటి తోట, సీనియర్లకు మాబడి పర్యావరణ హితం అనే అంశాలపై విద్యార్థులు చక్కని చిత్రాలు వేశారు. పట్టణంలోని 25 స్కూళ్ల నుండి 120 మందికి పైగా విద్యార్థులు పాల్గొన్నారు. జిల్లా జెవివి బాధ్యులు పి.జానకిరామ్, కార్యదర్శి గాదిరెడ్డి హరనాథ్, కోశాధికారి టంగుటూరు సుబ్బరామ శర్మ, ఉపాధ్యక్షురాలు సి.శారద, షేక్.ఖాదర్ బాషా, ఎం.వి.ఎన్.ప్రసాదరావు, కె.జాన్ పోటీల బాధ్యతల్లో పాల్గొన్నారు. కాగా నిర్వాహకులు మాట్లాడుతూ గురువారం జానపద, శాస్త్రీయ నృత్య పోటీలు రెడ్‌క్రాస్ భవన్‌లో మధ్యాహ్నం 2గంటలకు ప్రారంభమవుతాయన్నారు. ఉత్సాహంగా విద్యార్థులు పాల్గొనే విధంగా పాఠశాలల యాజమాన్యాలు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తల్లిదండ్రులు పిల్లలను ప్రోత్సహించి పంపాలని జనవిజ్ఞాన వేదిక పిలుపునిస్తుందన్నారు.

మాట్లాడుతున్న డాక్టర్ దయాకర్

ఆరోగ్యకేంద్రంలో తనిఖీలు

ప్రజాశక్తి-ఉదయగిరి

గండిపాలెం ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో జిల్లా ఫ్యామిలీ డాక్టర్ నోడల్ ప్రోగ్రామ్ అధికారి వైద్యులు దయాకర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. బుధవారం ఉదయగిరి మండల పరిధిలోని గండిపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఎంఎల్‌హెచ్‌పి, ఎఎన్ఎం ఆరోగ్య కార్యకర్తలతో జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలు తీరుపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన కార్యాలయ రికార్డులు పరిశీలించారు. అనంతరం మందుల స్టోర్ రూమును డెలివరీ గదులను ఆయన తనిఖీ చేసి పరిశీలించారు. కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ శివ కల్పన, ఆరోగ్య విద్యా బోధకులు వెంకటసుబ్బయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

'ఏడిఎఫ్' ద్వారా అభివృద్ధి పనులు

ప్రజాశక్తి-అనంతసాగరం : ఆత్మకూరు డెవలప్‌మెంట్ ఫోరం (ఎడిఎఫ్) ఆత్మకూరు నియోజకవర్గంలో అభివృద్ధి పనులు చేపడుతున్నామని ఎంఎల్‌ఎ మేకపాటి విక్రమ్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలో బుధవారం జెడ్‌పి ఛైర్‌పర్సన్ ఆనం.అరుణమ్మ, ఎంఎల్‌ఎ మేకపాటి విక్రమ్‌రెడ్డి అనంతసాగరంలో నిర్వహించిన విజయీభవ యాత్ర కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ మేరకు ఎడిఎఫ్ సౌజన్యంతో పలువురు దాతలు చేపట్టిన అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలతో పాటు ప్రభుత్వ భవన సముదాయాలకు ప్రారంభోత్సవాలు నిర్వహించారు. అనంతసాగరంలో రూ.20లక్షలతో నిర్మించిన పశు వైద్యశాల భవన ప్రారంభోత్సవాన్న నిర్వహించారు. మాజీ జెడ్‌పిటిసి బుట్టి వెంకటకృష్ణారెడ్డి జ్ఞాపకార్థం వారి కుటుంబసభ్యులు రూ.15లక్షల నిధులతో ఆత్మకూరు డెవలప్‌మెంట్ ఫోరం నేతృత్వంలో నిర్మించిన పంచాయతీ బస్టాండ్ నిర్మాణాన్ని ప్రారంభించారు. ప్రముఖ పారిశ్రామికవేత్త పి.రాందాస్ దాతృత్వంతో ఎడిఎఫ్ నేతృత్వంలో రూ.2.50లక్షల నిధులతో నిర్మించిన 108 అంబులెన్స్ ఉద్యోగుల వసతి గృహ భవనం నిర్మాణం పూర్తికావడంతో ప్రారంభోత్సవన్ని నిర్వహించారు. రూ.35లక్షలతో నిర్మించిన సచివాలయ భవనాన్ని, రూ.37.50 లక్షలతో నిర్మించిన మేకపాటి గౌతమ్ రెడ్డి జిల్లా ప్రజాపరిషత్ అతిథి గృహ ప్రారంభోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ విక్రమ్‌రెడ్డి మాట్లాడుతూ అనంతసాగరం పంచాయతీకి ఇప్పటి వరకు మన ప్రభుత్వంలో రూ.37.34 కోట్ల నిధులను సంక్షేమాభివృద్ధి కోసం అందజేసినట్లు వివరించారు. గడపగడపకు మన ప్రభుత్వం ద్వారా రూ.80లక్షలతో అభివృద్ధి పనులు నిర్వహించామని, రూ.15లక్షలతో బోర్లు ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఎన్ఆర్ఇజిఎస్ ద్వారా 2.35 కోట్లు, ఎంపి నిధులు రూ.4లక్షల ద్వారా అభివృద్ధి పనులను చేపట్టినట్లు వివరించారు. శ్రీవాణి ట్రస్టు ద్వారా రెండు దేవాలయాల పునర్నిర్మాణం కోసం రూ.20లక్షలు అందజేశామన్నారు. జిల్లా కలెక్టర్‌తో జరిపిన సమీక్షలతో అనంతసాగరం మండలంలో దాదాపు 367మంది రైతులకు లబ్ధి చేకూరిందని వివరించారు. నియోజకవర్గం సర్వతోముఖాభివృద్ధి కోసం ఏర్పాటు చేసిన ఆత్మకూరు డెవలప్‌మెంట్ ఫోరం ద్వారా ఇప్పటి వరకు రూ.22.5 లక్షల నిధులతో అభివృద్ధి పనులు నిర్వహించామన్నారు. పార్టీలకు అతీతంగా మన ప్రాంతంలోని పారిశ్రామికవేత్తలు అందరినీ కలుపుకుని అభివృద్ధిని కొనసాగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి రాపూరు వెంకటసుబ్బారెడ్డి, ఎంపిపి సంపూర్ణమ్మ, సర్పంచ్ శోభ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంఎల్‌ఎ మేకపాటి విక్రమ్‌రెడ్డి

జగనన్నను గెలిపించుకుందాం..

ప్రజాశక్తి-ఉదయగిరి : జగనన్న గెలుపునకు ప్రతి ఒక్కరూ సైనికుల పనిచేసి గెలిపించుకుందామని వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని సినిమాహాల్ సెంటర్ అరుంధతీయపాలెం ఇందిరానగర్ కాలనీలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా నియోజకవర్గం సమన్వయ కర్త మేకపాటి రాజగోపాల్ రెడ్డి పాల్గొని గడపగడపకు తిరిగి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ కార్యక్రమాలు రాష్ట్ర ప్రభుత్వం ద్వారా లబ్ధి పొందిన లబ్ధిదారులను కలిసి మాట్లాడుతూ ఇవే సంక్షేమ పథకాలు రాష్ట్రంలో కొనసాగాలంటే మరోమారు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డిని గెలిపించాలని ప్రజలను కోరారు. అన్ని రంగాల్లో అభివృద్ధి సంక్షేమం చేపట్టిన ఏకైక ప్రభుత్వం వైఎస్ఆర్ ప్రభుత్వం అని కొనియాడారు. పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందన్నారు. వైసిపి యువనేత అభినయరెడ్డి, జెడ్‌పిటిసి మోడీ రామాంజనేయులు, మండల కన్వీనర్ సిఎం ఓబుల్ రెడ్డి, జెడ్‌పి కో ఆప్షన్ మెంబర్ గాజుల తాజుద్దీన్, రాష్ట్ర సాహిత్య అకాడమీ డైరెక్టర్ అక్కి భాస్కర్ రెడ్డి, మండల ఉపాధ్యక్షురాలు మట్ల శాంతి, వైసిపి నాయకులు దస్తగిరి అహ్మద్, ఎంపిటిసి గొల్లపల్లి తిరుపతి, టింకర్ బాబు, అశోక్, ఎపిఎంఆర్‌పిస్ నియోజవర్గ అధ్యక్షులు ప్రసాద్, పెంచలయ్య, మండల కోఆప్షన్ మెంబర్ సుభాని, సర్పంచులు గౌస్ మొహిద్దీన్, కల్లూరు వెంకటేశ్వర రెడ్డి, తిరుపతిరెడ్డి, సచివాలయ కన్వీనర్ కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

రాజగోపాల్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న మహిళలు

పార్టీ బలోపేతానికి కృషి

ప్రజాశక్తి-విడవలూరు :

మాట్లాడుతున్న ఎంఎల్‌ఎ నల్లపరెడ్డి

పేదవారి పార్టీ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అని రైతు ప్రయోజనం కోసం పుట్టిన పార్టీ అని కోవూరు ఎంఎల్‌ఎ నల్లపరెడ్డి ప్రసన్న కుమార్ రెడ్డి పేర్కొన్నారు. రైతు సంక్షేమమే తమ ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యమని మరోసారి జగన్మోహన్ రెడ్డి పట్టాభిషేకంతో రైతులు గెలిపించుకుంటారని ఆశాభావం వ్యక్తం చేశారు. బుధవారం విడవలూరు మండల పరిధిలోని సినిమాహాల్ సెంటర్‌లో జరిగిన వైసిపి కుటుంబ సభ్యుల సమావేశానికి ముఖ్య అతిథులుగా ఆయన పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కరోనా కష్టకాలంలో ప్రజల మధ్యనే ఉంటూ రాష్ట్రంలో ఆర్థికంగా ఇబ్బందులు ఉన్నప్పటికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు అందజేసిన ఘనత జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. రానున్న ఎన్నికల్లో ఓటు అడిగే ధైర్యం వైసిపికి మాత్రమే ఉందన్నారు. కష్టపడి పనిచేసి ప్రజల వద్దకు వచ్చి ఓటు అడుగుతున్నామని ప్రభుత్వంపై టిడిపి – జనసేన పార్టీలు చేస్తున్న విమర్శలను తిప్పి కొట్టి తిరిగి వైసిపి పార్టీని అధికారంలో తీసుకురావాలని కోరారు. అలాగే పార్టీకి దూరంగా ఉన్న వారిని గుర్తించి వారిని పార్టీలో తీసుకురావాలని కోరారు. మండలంలో విస్తృతంగా సంక్షేమ పథకాలు ప్రతి పేదవాడికి అందాయని తమ ప్రభుత్వం ఏర్పడ్డాక కనీవిని ఎరుగని రీతిలో సంక్షేమ అభివృద్ధి పనులు జరిగాయని ప్రసన్న తెలిపారు. సర్వేలన్నీ మనకే అనుకూలంగా ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో యువజన విభాగం అధ్యక్షులు నల్లపరెడ్డి రంజిత్ కుమార్ రెడ్డి, పూండ్ల అచ్యుత్ కుమార్ రెడ్డి, నవీన్ రెడ్డి, కొండూరు వెంకటసుబ్బారెడ్డి, బుచ్చంగారి తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

ఇంట్లో షార్ట్ సర్క్యూట్

ప్రజాశక్తి-కోవూరు : స్థానిక మందబయలు సెంటర్లోని ఇండియన్ బ్యాంక్ మిద్దె పైన శేవల శ్రీరాములు నివాసం ఉన్నటువంటి ఇల్లు విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో బుధవారం ఉదయం అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. ఇంట్లోంచి పొగలు రావడంతో శ్రీరాములు తక్షణమే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన వచ్చి మంటలను అదుపు చేశారు. ఈ అగ్ని ప్రమాదంలో ఎవరికి ఇటువంటి గాయాలు కానీ ప్రాణం నష్టం కానీ, జరగలేదని విలువైన వస్తువులు దగ్ధమయ్యాయని వాటి విలువ సుమారు రూ.2లక్షలకు పైబడి ఉంటుందని ఎడిఎఫ్ఒ వేణుగోపాలరావు వెల్లడించారు.

రుచికరమైన ఆహారాన్ని అందజేయాలి

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

డాబాను ప్రారంభిస్తున్న ఎంఎల్‌ఎ

ఆత్మకూరు పట్టణ ప్రజలకు రుచి, శుచికరమైన, నాణ్యమైన ఆహారాన్ని అందజేసి వ్యాపారాన్ని దినదినాభివృద్ధి చేసుకోవాలని ఎంఎల్‌ఎ మేకపాటి విక్రమ్‌రెడ్డి కుమార్ డాబా నిర్వాహకులను సూచించారు. ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని స్పార్క్ సిటీ ఎదురుగా నూతనంగా ఏర్పాటు చేసిన కుమార్ డాబాను ఎంఎల్‌ఎ మేకపాటి ప్రారంభించారు. ఈ సందర్భంగా డాబా పరిసర ప్రాంతాలను పరిశీలించి నిర్వాహకు లను ప్రోత్సహించారు. జెసిఎస్ కన్వీనర్ డాక్టర్ సిహెచ్ ఆదిశేషయ్య, కౌన్సిలర్లు కామాక్షయ్య నాయుడు, ఎం.రాజశేఖర్, శివకోటారెడ్డి, ఎస్‌సిసెల్ అధ్యక్షుడు కొండ వెంకటేశ్వర్లు, నోటి వినయ్‌కుమార్ రెడ్డి, చిన్న, చెరుకూరి శ్రీనివాసులు నాయుడు, కేత రవి, కొప్పోలు చిన్నపరెడ్డి, రహీం, తదితరులున్నారు.

నైపుణ్యమైన విద్యతో ఉపాధి

ప్రజాశక్తి-కావలి

నియామకపత్రం అందజేస్తున్న దృశ్యం

విద్యార్థులకు నైపుణ్యంతో కూడిన విద్యను అందించినప్పుడే విద్యార్థికి ఉద్యోగ సాధన సులభమవుతుందని బెంగళూరుకు చెందిన ప్రముఖ ఐ.టి. కంపెనీ ట్యాప్ అకాడమీ హెచ్.ఆర్.మేనేజర్ నవీన్ పేర్కొన్నారు. బుధవారం డి.బి.ఎస్ ఇంజనీరింగ్ కళాశాలలో బెంగళూరుకు చెందిన ప్రముఖ ఐ.టి. కంపెనీ ట్యాప్ అకాడమీ నిర్వహించిన మూడు రౌండ్ల పరీక్షలలో 50మంది నాల్గవ సంవత్సరం విద్యార్థులు పాల్గొనగా వారిలో 30మంది విద్యార్థులు ఎంపిక అయ్యారని ట్యాప్ అకాడమీ హెచ్.ఆర్.మేనేజర్ నవీన్ తెలియజేశారు. ఈ ఎంపికైన విద్యార్థులకు తగిన శిక్షణను అందించి మంచి వార్షిక వేతనంతో ఉత్తమ సాఫ్ట్‌వేర్‌లుగా తయారు చేస్తామని తెలియజేశారు. ఈ సందర్భంగా డి.బి.ఎస్. కళాశాల కరెస్పాండెంట్ దామిశెట్టి.సుధీర్ నాయుడు మాట్లాడుతూ విద్యతోపాటు ఉద్యోగ కల్పన కూడా డి.బి.ఎస్.కే సాధ్యమని తెలియజేస్తున్నామని హర్షం వ్యక్తం చేశారు. డి బి.ఎస్. కళాశాలలో చదివిన ప్రతి విద్యార్థికి ఉద్యోగ కల్పనే లక్ష్యంగా కళాశాల పని చేస్తుందని విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకొని బంగారు భవిష్యత్తు ఏరుపర్చుకోవాలని సూచిస్తూ ఎంపికైన విద్యార్థులను అభినందించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.వి.రావు మాట్లాడుతూ డి.బి.ఎస్ కళాశాలలో మరిన్ని బహుళ జాతీయ కంపెనీలను ఆహ్వానించి విద్యార్థులకు ఉద్యోగ కల్పన చేయడమే కళాశాల ధ్యేయమని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ఎ.ఒ. జి.రమేష్ బాబు, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ జి.సురేష్ కుమార్, కళాశాల ఇ.ఇ.ఇ. హెచ్.ఒ.డి. సుజల, డాక్టర్ శ్రీలత, ఎన్.వి.కిషోర్, ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు.

CHANGE OF NAME

I, VAYUGUNDLA VENKATA LAKSHMI SUPRIYA (Old Name), Resident of 27-2-98, Balaji Nagar, 19th Cross Road, Nellore-524002, SPSR Nellore Dt, AP. Here by declare that I have changed my name as **VAYUGUNDLA LAKSHMI SUPRIYA** (New Name) W/o. VAYUGUNDLA KIRAN KUMAR.

In The Court of The 1st Addl. Junior Civil Judge : Nellore

O.S.No. 811 / 2019

M/s. Corporation Bank, Nellore Branch, Rep.by its Chief Manager, Brindavanam, Nellore, SPSR Nellore District. - Plaintiff

Vs

Arava Kanna - Defendant

Notice to Defendant

Arava Kanna, S/o **A.Kotaiah,** D.No.28-1-426, Mypadu Road, Bodigadithota, Aravapalem, Nellore City, SPSR Nellore District.

పై నెంబరు కేసులో వాది మీమీద పై వారి కోర్టు లో బ్యాంక్‌లోన్ బాకీ రాబట్టుకొనుటకు దావా దాఖలు చేసియున్నారు. సదరు దావాలో మీకు నోటీసు నిమిత్తం **తే20-3-2024** దిన వాయిదా ఉన్నది. ఆరోజు **ఉదయం 10.30 గం॥లకు** మీరు స్వయంగా గాని వకీలు ద్వారా గాని హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొన వలసినది. లేని యెడల కేసు మీ పరోక్షమున తీర్మానించబడును.

దామిశెట్టి సుభాషిణి, M.A., L.L.M., P.hd., వాది తరపు న్యాయవాది, నెల్లూరు.

In The Court of The 1st Addl. Junior Civil Judge : Nellore

O.S.No. 623 / 2021

M/s. Canara Bank, a body corporate (Erstwhile known Syndicate Bank Constituted SME Branch, Vedayapalem, Nellore. Rep.by its Chief Manager, Nellore. - Plaintiff

Vs

Palamangalam Bhagyaraj - Defendants

Notice to Defendant

Palamangalam Bhagyaraj, S/o **Sabhapathi,** D.No.26-2-3087, Subhash Nagar, Nellore.

పై నెంబరు కేసులో వాది మీమీద పై వారి కోర్టు లో బ్యాంక్‌లోన్ బాకీ రాబట్టుకొనుటకు దావా దాఖలు చేసియున్నారు. సదరు దావాలో మీకు నోటీసు నిమిత్తం **తే20-3-2024** దిన వాయిదా ఉన్నది. ఆరోజు **ఉదయం 10.30 గం॥లకు** మీరు స్వయంగా గాని వకీలు ద్వారా గాని హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొన వలసినది. లేని యెడల కేసు మీ పరోక్షమున తీర్మానించబడును.

దామిశెట్టి సుభాషిణి, M.A., L.L.M., P.hd., వాది తరపు న్యాయవాది, నెల్లూరు.

In The Court of The 1st Addl. Junior Civil Judge : Nellore

O.S.No. 1195 / 2021

M/s. Union Bank of India, Branch Office at Trunk Road, Rep.by its Branch Manager, SPSR Nellore District. - Plaintiff

Vs

1. Kalapati Tapaswi and 2 others - Defendants

Notice to 3rd Defendant

P.Murali Mohan, S/o **Suryanarayana,** Gandavaram (P & V), Kodavalur Mandal, SPSR Nellore District.

పై నెంబరు కేసులో వాది మీమీద పై వారి కోర్టు లో బ్యాంక్‌లోన్ బాకీ రాబట్టుకొనుటకు దావా దాఖలు చేసియున్నారు. సదరు దావాలో మీకు నోటీసు నిమిత్తం **తే6-3-2024** దిన వాయిదా ఉన్నది. ఆరోజు **ఉదయం 10.30 గం॥లకు** మీరు స్వయంగా గాని వకీలు ద్వారా గాని హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొన వలసినది. లేని యెడల కేసు మీ పరోక్షమున తీర్మానించబడును.

దామిశెట్టి సుభాషిణి, M.A., L.L.M., P.hd., వాది తరపు న్యాయవాది, నెల్లూరు.

ట్రాక్టర్ కింద పడి వ్యక్తి దుర్మరణం

ప్రజాశక్తి-ఉదయగిరి

పట్టణ శివారు ప్రాంతంలో ట్రాక్టర్ బోల్తా పడ్డ సంఘటనలో వ్యక్తి దుర్మరణం చెందిన ఘటన ఉదయగిరిలో బుధవారం చోటు చేసుకుంది. ఎస్ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి వివరాల మేరకు.. వైఎస్ఆర్ కడప జిల్లా బద్వేల్ పట్టణానికి చెందిన తుపాకుల గురవయ్య(45) దుత్తలూరు మండలం వెంకటమ్మపేట గ్రామంలో గత కొద్ది రోజులుగా బేల్దారు పనులు చేసేందుకు వచ్చారని మంగళవారం రాత్రి కొందరితో కలిసి ట్రాక్టర్లు ఉదయగిరికి వెళ్లొస్తానని కుటుంబ సభ్యులకు చెప్పి వెళ్లినట్లు తెలిపారాన్నారు. ఎంతసేపటికీ గురువయ్య ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు దుత్తలూరు పోలీస్ స్టేషన్లో రిపోర్ట్ ఇచ్చినారు. బుధవారం ఉదయం పట్టణ శివారు ప్రాంతంలో డాక్టర్ ప్రమాదంలో తుపాకుల గురవయ్య మృతి చెందారని తెలిపారు. మృతుడికి భార్య కుమార్తె కుమారుడు ఉన్నారు. మృతదేహానికి సామాజిక ఆరోగ్య కేంద్రంలో శవపరీక్షలు తరలించి కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఆయన తెలిపారు.

ఎన్నికల్లో విజయానికి కలిసి పని చేద్దాం..

ప్రజాశక్తి-ఇందుకూరుపేట

పార్టీ నాయకులు, కార్యకర్తలు చిన్నచిన్న మనస్పర్ధలు పక్కనపెట్టి అందరూ కలిసికట్టుగా పనిచేసి విజయం సాధించాలని కోవూరు ఎంఎల్ఎ నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి నాయకులకు పిలుపునిచ్చారు. బుధవారం మొత్తలు గ్రామంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యుల ఆత్మీయ సమావేశం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండలంలోని అన్ని గ్రామాల నుంచి వచ్చిన నాయకులతో ఆయన సమావేశమయ్యారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమకు తమ కుటుంబానికి ఎన్నో సంవత్సరాల నుంచి అండగా కోవూరు నియోజకవర్గ ప్రజలు, ముఖ్యంగా ఇందుకూరు పేట మండల ప్రజలు తమవెంటే ఉన్నరన్నారు. కార్యక్రమంలో వైసిపి యువజన విభాగం అధ్యక్షులు నల్లపరెడ్డి రజిత్ కుమార్ రెడ్డి, గొల్లపల్లి విజయ్ కుమార్ యాదవ్, మావులూరు శ్రీనివాసులు రెడ్డి, అన్ని గ్రామాల వైసిపి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాలతో గ్రామ స్వరాజ్యం

ప్రజాశక్తి-సీతారామపురం

సచివాలయాల ద్వారా ప్రజలకు కావాల్సిన గ్రామ స్వరాజ్యం అందుతుందని ఉదయగిరి నియోజక వర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మాజీ ఎంపిపి కల్లూరి జనార్ధన్ రెడ్డి, సర్పంచ్ కల్లూరి వెంకటరెడ్డి ఆధ్వర్యంలో బాలాయపల్లి సచివాలయాన్ని, పోరుమామిళ్ల కాశయ్య ఆధ్వర్యంలో పబ్బులేటిపల్లి సచివాలయం, అయ్యవారి పల్లి సచివాలయాన్ని, పలు రైతు భరోసా కేంద్రాలను ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయా గ్రామాలలో విజయ సంకల్ప యాత్రను నిర్వహించారు.

బాధిత కుటుంబానికి ఎంఎల్ఎ పరామర్శ

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

చేజర్ల మండలం, ఏటూరు గ్రామంలో ఇటీవల మృతి చెందిన ఉట్లపల్లి చంద్రశేఖర్ కుటుంబ సభ్యులను బుధవారం ఎంఎల్ఎ మేకపాటి విక్రమ్‌రెడ్డి పరామర్శించారు. ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై చంద్రశేఖర్ మృతి చెందారని తెలుసుకున్న ఎంఎల్ఎ వారి కుటుంబసభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. మృతి చెందిన చంద్రశేఖర్ ఆర్‌వైపాళెం గ్రామ పంచాయతీ సెక్రటరీగా విధులు నిర్వర్తిస్తుండేవారు. ఎంఎల్ఎవెంట స్థానిక ప్రజాప్రతినిధులు, వైసిపి నాయకులున్నారు.

ఎలక్షన్ కోడ్ లేకపోయినా ట్రై సైకిళ్లు సీజ్ చేస్తారా..!

ప్రజాశక్తి-నెల్లూరు సిటీ

మాట్లాడుతున్న మాజీ మంత్రి నారాయణ

నిరుపేదల కోసం ఇచ్చే బ్యాటరీ ట్రై సైకిళ్లను ఎన్నికల కోడ్ లేకపోయినా అధికారులు సీజ్ చేయడం బాధాకరమని...మాజీ మంత్రి, నగర నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ పొంగూరు నారాయణ ఆవేదన వ్యక్తం చేశారు. నెల్లూరు నగరం 16వ డివిజన్‌లోని టీడీపీ కార్యాలయంలో... బుధవారం టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ తాళ్లపాక అనూరాధలతో కలిసి ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెల్లూరు సిటీ నియోజకవర్గంలో బాబు ష్యూరిటీ - భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమానికి మంచి స్పందన వస్తుందని సంతతోషం వ్యక్తం చేశారు. సిటీలో ఎంతో అద్భుతంగా...ఎస్టీఎన్ రోడ్లు వేశారని ప్రజలే చెబుతున్నారన్నారు. ప్రజలం దరూ తాను చేసిన పనులన్నింటిని గుర్తు పెట్టుకోవడం చాలా సంతోషంగా ఉంద న్నారు. చేసిన అభివద్దిని ప్రజలెవరూ మరచిపోరన్నారు. నెల్లూరు నగరం మొత్తాన్ని చండీఘర్ మోడల్ గా తీర్చిదిద్దాలని ప్లాన్ చేశానన్నారు. ఛండీఘర్‌లో రెండు పక్కలా...డిఫరెంట్ మల్టీ కలర్స్ లో చెట్లు ఉంటాయన్నారు. నెల్లూరులో ఇంకా కొన్ని సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. మన ప్రభుత్వం రాగానే...ఆ సమస్యలన్నింటిని పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అందుకు తమ నాయకులు కొందరు స్పందించి విజయవాడ నుంచి పది ట్రై సైకిళ్లను జీఎస్టీ చెల్లించి మరీ తెప్పించడం జరిగిందన్నారు. వీటిని ఇచ్చిన వాళ్ళు...నేను స్పాన్సర్ చేసినట్లు రాసి ఇచ్చారన్నారు. వాటిని కూడా ఈ ప్రభుత్వం సీజ్ చేయడం దారుణమన్నారు. అసలు ఎలక్షన్ కోడ్ ఇంకా రాలేదని...నిరుపేదలైన వారికి ట్రై సైకిళ్లు ఇస్తే... వాటిని కూడా సీజ్ చేస్తారా...అని సూటిగా ప్రశ్నించారు. అధికారులు తమ విధుల్ని వారు నిర్వర్తించాలని... మీపై నాయకులు ఏదో చెప్పారని చేయడం చాలా తప్పు అన్నారు. అక్రమంగా లిక్కర్ తరలిస్తుంటే సీజ్ చేయండి తప్పు లేదు...కానీ నిరుపేదలకి ఇచ్చే ట్రై సైకిళ్లను కూడా సీజ్ చేయడం దుర్మార్గమన్నారు. ఎలక్షన్ కోడ్ రాలేదు కాబట్టి...ఎవరైనా దాన ధర్మాలు చేయొచ్చని...లేకపోతే మీరే వచ్చి నెల్లూరు జిల్లాలోని నిరుపేదలందరికి ట్రై సైకిళ్లు ఇవ్వండి...నేనే సంతోషిస్తానని హితవు పలికారు. నా దగ్గర చదువుకున్న ఎందరో ఇతర స్టేట్స్ లో...ఉన్నత స్థానాల్లో ఎన్ఆర్ ఐలుగా ఉన్నారన్నారు. వారందరూ కూడా ఫోన్లు చేసి... సార్..మీ నియోజకవర్గానికి మేము ఏదో ఒకటి చేస్తామని చెబుతూనే ఉన్నారని గుర్తు చేశారు. వెంటనే ఆ ట్రై సైకిళ్లను అధికారులు రిలీజ్ చేయాలని కోరారు. అనం తరం కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ ఈ వైసీపీ ప్రభుత్వంలో... రాజకీయాలు అనేవి రాజకీయాలుగా లేవన్నారు. నా 40 ఏళ్ల రాజకీయ జీవితంలో. ..ఎంతో మంది ముఖ్యమంత్రు ల్ని, మంత్రుల్ని, ఎమ్మెల్యేలను చూశానన్నారు. శాసన సభలో బూతులు మాట్లాడే ఎమ్మెల్యేలను ఈ ప్రభుత్వంలోనే చూశానన్నారు. అసలు ఎలక్షన్ కోడ్ ఏమీ లేదు...మరీ నిరుపేదలకు ఇచ్చే ట్రై సైకిళ్లను ఎలా పట్టుకుంటారని అధికారులను సూటిగా ప్రశ్నించారు. మరో రెండు నెలల్లో మీ ముఖ్యమంత్రి జగన్ ఇంటికెళ్లడం ఖాయమని...మా చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావడం తథ్యమన్నారు. అధికారులందరూ నీతి నిజాయితీగా పని చేయాలన్నారు.

జనసేనలో పదవుల పందేరం

మాట్లాడుతున్న జనసేన నాయకులు

ప్రజాశక్తి-నెల్లూరు అర్బన్

జనసేన అధినేత పవన్ కళ్యాణ్, జిల్లా అధ్యక్షుడు చెన్నారెడ్డి మనుక్రాంత్ రెడ్డి ఆదేశాలతో నెల్లూరు జిల్లాలో పలువురు జనసైనికులకు పదవులు లభించాయి. డివిజన్ ఇన్‌ఛార్జిలకు.. నగర కమిటీలో చోటు దక్కింది. ఈ సందర్భంగా బుధవారం జనసేన జిల్లా కార్యాలయంలో వారికి జనసేన నగర అధ్యక్షుడు దుగ్గిశెట్టి సుజయ్ బాబు నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా సుజయ్ బాబు మాట్లాడుతూ గతంలో పలు డివిజన్‌లలో ఇన్‌ఛార్జిలుగా ఉన్న వారిని నగర కమిటీలోకి తీసుకోవడం జరిగిందన్నారు. అదేవిధంగా ఆయా స్థానాల్లో పార్టీ కోసం కష్టపడి పనిచేసే కార్యకర్తలను డివిజన్ ఇన్‌ఛార్జిలుగా నియమించామన్నారు. 8వ డివిజన్ ఇన్ఛార్జిగా తెల్లపాటి వినయ్ కుమార్ , 31వ డివిజన్ ఇంఛార్జి గా సయ్యద్ షాకీర్, 35వ డివిజన్ ఇంచార్జ్ గా పేడాడ ఆనందరావు, నగర కార్యదర్శిగా సయ్యద్ ఎజ్ధానీని నియమిస్తున్నట్లు ప్రకటించారు. రానున్న రోజుల్లో జనసేన పార్టీ కోసం బలంగా కష్టపడి పనిచేయాలని సూచించారు. నెల్లూరు నగర , రూరల్ నియోజకవర్గాల్లో ఉమ్మడి అభ్యర్థుల గెలుపు కోసం శక్తి వంచన లేకుండా కృషి చేయాలని పిలుపునిచ్చారు. అన్ని డివిజన్‌లలో జనసేన జెండాను రెపరెపలాడించాలన్నారు. కొత్తగా నియమితులైన వారికి ఆయన శుభాకాంక్షలు తెలిపారు. తొలుత కొత్తగా ఎంపికైన వారు సుజయ్ బాబును .. శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జనసేన జిల్లా కార్యదర్శి షేక్ ఆలియా, నగర ప్రధాన కార్యదర్శులు షేక్ కంతర్, కరీం, డివిజన్ ఇన్‌ఛార్జులు శ్రీకాంత్, అజయ్ బాబు, నితీష్, రాము, నాగూరు, తదితరులు పాల్గొన్నారు.

పలుచోట్ల సరస్వతి పూజ

ప్రజాశక్తి-మర్రిపాడు : వసంత పంచమి వేడుకలను చుంచులూరు ఉన్నత పాఠశాల ఆవరణలోని ఉన్న సరస్వతి దేవి విగ్రహం వద్ద పూజలు ఘనంగా నిర్వహించారు. పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు సరస్వతీ దేవికి అభిషేకాలు, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుధాకర్ మాట్లాడుతూ విద్యార్థులందరూ బాగా కష్టపడి చదివి మంచి మార్కులు సాధించి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.

ప్రజాశక్తి-ఇందుకూరుపేట: మండలంలోని నరసాపురం ఎం.వి.ఆర్.ఆర్. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం ఘనంగా సరస్వతిపూజ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా 13వ తేదీ జరిగిన విజ్ఞాన శాస్త్ర ప్రదర్శన ఇన్‌స్పైర్ మేనాక్ 2024 పోటీలలో అత్యధిక ప్రతిభ కనపరచి రాష్ట్రస్థాయి విజ్ఞాన శాస్త్ర ప్రదర్శనకు ఎన్నికైన షేక్.తహసీనకు ప్రశంసా పత్రాన్ని, మెమెంటోను జీవ శాస్త్ర ఉపాధ్యాయులు ఎన్.సి. మౌల, పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాగేశ్వరావు అందించారు.

వైసిపిలో అరాచకాలు తప్ప అభివృద్ధి శూన్యం

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు

వైసిపి ప్రభుత్వంలో దుర్మార్గాలు, అక్రమాలు తప్ప అభివద్ధి అనేది లేనేలేదని మాజీ మంత్రి సోమిరెడ్డి విమర్శించారు. బుధవారం మం డలంలోని పోట్లపూడి గ్రామంలో లేబూరు కృష్ణారెడ్డి, నాసిన గిరీష్ ఆధ్వర్యంలో దళిత యువకులు నావూరు శివకృష్ణ, ఈదూరు సుకుమార్ కు తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈ సందర్భం గా టీడీపీ అధ్యక్షులు సన్నారెడ్డి సురేష్ రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో చంద్రమోహన్ రెడ్డి మాట్లాడుతూ రాజకీయ జీవితంలో ప్రజలకు సేవ చేయలే తప్ప ప్రజలపై దౌర్జన్యం కాదని మంత్రి గోవర్ధన్ రెడ్డిపై ధ్వజమెత్తారు. అధికారం అనుభవిస్తూ మీరు ప్యాలెస్ లో ఉంటూ నిరుపేద లు చెట్ల కింద బతకాల అని ప్రశ్నించారు. తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో కట్టిన ఇళ్లకు బి ల్లులు ఆపడం దారుణ మన్నారు. ఇలాంటి దుర్మార్గపు ప్రభుత్వాన్ని ఎన్నడూ చూడలేదని, సర్వేపల్లిలో వైసిపి దౌర్జన్యాల కు ఎస్సీ, ఎస్టీ, బీసీలు బలవుతున్నారని ఆరోపించారు. దోచుకోవడం, దాచుకో వడం తప్ప వైసీపీ చేసిన అభివృద్ధి ఏమీ లేదని ఎద్దేవా చేశారు. గత ఐదేళ్ల కా లంలో తనపై మంత్రి గోవర్ధన్ రెడ్డి ఉపయోగించిన నీచాతి నీ చమైన భాష వార్డు సభ్యులు కూడా వాడరని విమర్శించారు. వైసీపీ ప్రభుత్వా నికి గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు.కార్యక్రమంలో టిడిపి మండల ప్రధాన కార్యదర్శి ముత్యా ల శ్రీనివాసులు, ఇసుక పాలెం సర్పంచి ఇంగిలాల చైతన్య కుమార్, యువత పాముల హర్షవర్ధన్, శివయ్య నాయుడు, వెంకయ్య, సొరకత్తి శ్రీనివాసులు, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

వైసిపి ప్రభుత్వాన్ని ఇంటికి పంపించాలి

ప్రజాశక్తి నెల్లూరు సిటీ

వైసీపీ ప్రభుత్వం అరాచకాలే తప్ప.. అభివృద్ధి శూన్యమని పేదలకు ఓ చేత్తో పది రూపాయలు ఇచ్చి మరో చేత్తో 100 రూపాయలు లాగేసుకుంటున్నారని ఈ ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపాలని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి పేర్కొన్నారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలోని దేవరపాలెంలో వై.ఎస్.ఆర్. కాంగ్రెస్ పార్టీ నేత, శ్రీ వేదగిరి నరసింహస్వామి దేవస్థానం చైర్మన్ వేమిరెడ్డి సురేంద్ర రెడ్డి, ముత్తంశెట్టి శ్రీనివాసులు వారి మిత్రబృందం బుధవారం రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, టీడీపీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. వారికీ పార్టీ కండువా కప్పి తెలుగుదేశం పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ చంద్రబాబు నాయుడుని ముఖ్యమంత్రి చేసుకొని, నెల్లూరు రూరల్ నియోజకవర్గంలోని ప్రధాన సమస్యలను త్వరితగతిన పరిష్కరించుకుందామన్నారు.గత 9 సంవత్సరాలుగా నిరంతరం పిలిస్తే పలికే ఎమ్మెల్యేగా ప్రజల మధ్యలోనే ఉన్నానని, ప్రజా సమస్యల పరిష్కారం కోసం నా శక్తికి మించి కృషి చేశానన్నారు. నిరంతరం ప్రజల శ్రేయస్సు కోసమే పాటుపడుతున్నానని టిడిపిని అఖండ మెజార్టీతో గెలిపిస్తే మరింత అభివృద్ధి పనులు చేసి ప్రజలకు అందిస్తానన్నారు

వైసిపిలో 50 కుటుంబాలు చేరిక

ప్రజాశక్తి-కావలి రూరల్

మండల పరిధిలోని ఆముదాలదిన్నె గ్రామానికి చెందిన టిడిపి కార్యకర్తలు బుధవారం ఆముదాలదిన్నె గ్రామ సర్పంచ్ బ్రహ్మానందం, మాజీ జెడ్‌పిటిసి కందుల శ్రీనివాసులు, మాజీ ఎఎంసి డైరెక్టర్ కాటా శ్రీనివాసులు రెడ్డి ఆధ్వర్యంలో 50 కుటుంబాలు ఎంఎల్ఎ రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి సమక్షంలో వైసిపి కండువాలు కప్పి వారిని సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి వల్లే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు.

వృద్ధులకు నిత్యావసరాలు అందజేత

ప్రజాశక్తి-కావలి

కావలి పట్టణం తుపాన్ నగర్లోని సంయుక్త సేవాసంస్థ కార్యాలయంలో బుధవారం కావలి పట్టణం నివాసులు ఒట్టూరు చిత్రకల్పన తన కుమారుడు సుచిర్ జ్ఞాపకార్థంగా నిరుపేద వృద్ధులకు నెలకు సరిపడా నిత్యావసర వస్తువులు, బియ్యం వితరణ చేశారు. ఈ సందర్భంగా సంస్థ సభ్యులు ఎమ్.అజిత్ బాబు మాట్లాడుతూ ఒట్టూరు.చిత్ర కల్పన గత కొన్ని నెలలుగా సంయుక్త సేవాసంస్థ సభ్యులుగా చేరి పేదలకు సేవలందిస్తున్నారని తెలిపారు. ఈ మేరకు చిత్రకల్పనకు సంస్థ సభ్యులు అందరి తరఫున హృదయ పూర్వక ధన్యవాదాలు తెలియజేస్తు న్నామన్నారు.